31న జూట్ మిల్లు సమస్యలపై మరో దఫా చర్చలు

కొత్తవలస, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : తుమ్మికాపల్లి శివారు సీతంపేటలో ఉన్న ఉమా జూట్ మిల్లుకు సంబంధించి ఈ నెల 31న మరోసారి కార్మికులతో చర్చించనున్నట్లు కర్మాగార కార్మిక సంఘ గౌరవాధ్యక్షుడు గణేష్ పండా తెలిపారు. ఈ నెల 30న లాకౌట్‌ను ఎత్తి వేయడానికి తాజాగా యాజమాన్యం అంగీకరిస్తూ అగ్రిమెంట్‌పై సంతకాలు చేసిందని, అయితే జేసీఎల్ ముందుగా లాకౌట్ ఎత్తి వేసి కార్మికులను పనిలోకి పెట్టుకున్నాక 31న చర్చలకు రావాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. 31న జరిగే చర్చల్లో కార్మికులు, యాజమాన్యానికి సంబంధించిన వివిధ అంశాలపై ఫైల్ క్లోజ్ చేస్తామని జేసీఎల్ తెలిపిందన్నారు.

విజయీభవ



- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 119 కేంద్రాలు
- హాజరుకానున్న 22,930 మంది
- పేపర్ లీక్ చేస్తే కఠిన చర్యలు: జిల్లా పరిశీలకురాలు తెహరా సుల్తాన్

విజయనగరం కలెక్టరేట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి)

పదో తరగతి పరీక్షలు మరికొద్ది గంటల్లో ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. ఎటువంటి లోపాలు తలెత్తకుండా పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం నుంచి ఈనెల 31 వరకూ జిల్లా వ్యాప్తంగా 119 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. 22,930 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో బాలురు (రెగ్యులర్ 11,501), బాలికలు (రెగ్యులర్ 11,429)తో పాటు ప్రైవేటు విద్యార్థులు 835 మంది ఉన్నారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులు 640 మంది ఎనిమిది కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు జరగనున్నాయి. ప్రతి కేంద్రానికీ చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ అధికారిని నియమించారు. 9 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. (రెగ్యులర్ విద్యార్థుల పరీక్షలను పర్యవేక్షించేందుకు ఏడుగురు, ఓపెన్ స్కూల్ పరీక్షలను పర్యవేక్షించేందుకు ఇద్దరు). జిల్లాలోని ఎ కేటగిరికి చెందిన 53, బి కేటగిరి 31, సి కేటగిరికి చెందిన 35 పరీక్షా కేంద్రాలున్నాయి. పట్టణ ప్రాంతాల్లో 34, గ్రామీణ ప్రాంతాల్లో 85 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. రెండు విడతలుగా 2,248 మంది ఇన్విజిలేటర్లను జిల్లా అధికారులు నియమించారు. అలాగే సమస్యాత్మక కేంద్రాలైన నాలుగు కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. జడ్పీ హైస్కూల్ (కలవచర్ల), గాయత్రీ హైస్కూల్ (తోటపాలెం), జడ్పీహెచ్ఎస్ (సీతారామపురం), జడ్పీహెచ్ఎస్ (పెరుమాళి)కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నిర్వహణపై ఇటీవల కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, సంబంధిత శాఖాధికారులకు సూచనలు ఇచ్చారు.



- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. విద్యార్థులు కాని, ఇన్విజిలేటర్లు కాని పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ తీసుకురాకూడదు. ఆయా ప్రాంతమంతా నోఫోన్ జోన్‌గా ప్రకటించారు. సీఎస్ తప్ప మిగిలిన వారెవరూ పరీక్షా కేంద్రంలోకి ఫోన్ తీసుకురాకూడదు.

9 గంటలకే చేరుకోవాలి..

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి 9 గంటలకు చేరుకోవాల్సి ఉంది. 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు కేంద్రంలోనే ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే 10 గంటల వరకూ అనుమతిస్తారు. ఆర్టీసీ అధికారులు పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా బస్సు ప్రయాణం సమకూర్చారు.

కంట్రోల్ రూం ఏర్పాటు..

పరీక్షలు రాసే విద్యార్థులకు ఏమైనా సందేహాలు, సమస్యలుంటే తెలియజేసేందుకు జిల్లా ఎగ్జామినేషన్ కేంద్రంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ఫోన్ నంబర్ 90009 45346కు తమ సమస్యలను తెలియజేయవచ్చు.



పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా పరిశీలకురాలు, డీఈవో

ఒత్తిడికి గురికావద్దు


- పేపర్ లీక్ చేస్తే కఠిన చర్యలు
- జిల్లా పరిశీలకురాలు తెహరా సుల్తాన్

విజయనగరం కలెక్టరేట్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని జిల్లా పరిశీలకురాలు తెహరా సుల్తాన్ కోరారు. ఆదివారం జిల్లాకు వచ్చిన ఆమె స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, పరీక్షకు వచ్చే ముందు విద్యార్థులు చక్కగా భోజనం చేసి కేంద్రానికి రావాలని సూచించారు. ఎక్కడైనా పేపర్ లీక్ అయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇన్విజిలేటర్లు కాని, విద్యార్థులు కాని ఎవరూ పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ తీసుకురాకూడదని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి వి.మాణిక్యంనాయుడు మాట్లాడుతూ, జిల్లాలో పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రతి కేంద్రంలో మంచినీరు, నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో పార్వతీపురం డీఈవో ఎంటీ నాయుడు, డీఈసీ బోర్డు సెక్రటరీ సన్యాసిరాజులు ఉన్నారు.

సారూ.. సిఫారసు చేయరూ..



- ఉపాధి హామీ పథకంలో బదిలీల జాతర
- రాజకీయ నాయకుల చుట్టూ అధికారుల ప్రదక్షిణ
- మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసన్నం కోసం విన్యాసాలు
- నచ్చిన మండలాల కోసం విన్నపాలు
- పదిహేనేళ్లుగా ఒకే క్లస్టర్‌లో తిష్ఠవేసిన ఉద్యోగులు



జిల్లాలో

ఉపాధి హామీ పథకంలో ప్రారంభమైన ఉద్యోగుల బదిలీల జాతరలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసన్నం కోసం ఉద్యోగులు పలు విన్యాసాలు చేస్తున్నారు. తెల్లారేసరికి వారి ఇంటి వద్ద ప్రత్యక్షమైపోతున్నారు. లెటర్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. గంటలకొద్దీ అక్కడే తిష్ఠవేస్తున్నారు. సిఫారసులకు అతీతంగా బదిలీలు అంటూ సంబంధిత రాష్ట్ర అధికారులు చెబుతున్నప్పటికీ కొందరు ఉద్యోగుల రాజకీయ విన్యాసాల నేపథ్యంలో బదిలీల మార్గదర్శకాలు ఎంతవరకు పక్కాగా అమలవుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

మెంటాడ, మార్చి 16(ఆంధ్రజ్యోతి):

రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయి సిబ్బంది మినహా ఏపీడీలు, ఏపీవోలు సహా టెక్నికల్ అసిస్టెంట్లు, జేఈలు, కంప్యూటర్ ఆపరేటర్లు, మేట్‌ట్రైనీలు ఇలా అన్ని కేడర్లలో సాధారణ బదిలీలకు అవకాశం ఇచ్చింది. అదే సమయంలో 20 మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం జారీ చేసింది. కలెక్టర్, డ్వామా పీడీతో కూడిన కమిటీ నేతృత్వంలో జరిగే ఈ బదిలీల్లో మార్గదర్శకాల ఉల్లంఘన లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. వివిధ కేడర్లలో పనిచేసే అధికారులు, ఉద్యోగులకు సంబంధించి కేడర్ల వారీగా కూడా కొన్ని నిర్దిష్టమైన సూచనలు జారీ చేసింది. మార్గదర్శకాలు ఇలా ఉంటే క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇంకోలా ఉన్నాయి. ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితర ఉద్యోగులు రాజకీయ సిఫారసుల కోసం పోటాపోటీ ప్రయత్నాలు మొదలుపెట్టేశారు. స్థానిక శాసనసభ్యులు, మంత్రుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. నేరుగా కలిసే పలుకుబడి లేని వారు మండల స్థాయి నేతలతో పైరవీలు చేయిస్తున్నారు. జోక్యం చేసుకున్నట్లు బయటకు పొక్కితే పార్టీ పెద్దల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందనే భయం ఓ వైపు.. నమ్ముకున్న వారికి న్యాయం చేయకపోతే చెడ్డపేరు వస్తుందనే ఆందోళన మరో వైపు నేతలను వెంటాడుతోంది. ఏం చేయాలో పాలుపోక ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు సతమతమవుతున్నారు. అయితే భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని రెండోదాని వైపే మొగ్గు చూపుతున్నారు. తమవారు కోరిన ప్రాంతానికి బదిలీ జరిగేలా చూడాలని సంబంధించి అధికారులకు సూచించాలని నిర్ణయించారు.

గతంలో అంతా మా ఇష్టం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి బదిలీల మార్గదర్శకాలను అప్పటి నేతలు కాగితాలకు పరిమితం చేసి అంతా మా ఇష్టం అన్న తరహాలో వ్యవహరించి తమకు నచ్చిన వారిని వారు కోరుకున్న చోటుకు బదిలీ (మిగతా 8వ పేజీలో..)



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

అమరజీవి ఆశయాలను తెలియజేయాలి

- కలెక్టర్ అంబేడ్కర్
- ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

విజయనగరం కలెక్టరేట్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం కోసం త్యాగం చేసి ఆమరణ నిరహార దీక్ష చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను ప్రస్తుత తరానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సభ కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎందరో త్యాగాల ఫలితంగా స్వాతంత్ర్యం దక్కించుకున్నామని, అందులో భాగంగా ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన సేవ మరువలేనిదని అన్నారు. ప్రభుత్వం కూడా పొట్టి శ్రీరాము లకు తగిన గుర్తింపు ఇచ్చిందని, ఆయన పేరున జిల్లా ఏర్పాటు చేయడం చాలా విశేష మన్నారు. అనంతరం డీఈవో మాణిక్యంనాయుడు మాట్లాడుతూ, మహాత్మాగాంధీ ఇచ్చిన ఆలోచన మార్గద ర్శకాలను అనుసరించి పొట్టిశ్రీరాములు కూడా మహాత్ముడిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాస మూర్తి, మైనార్టీ సంక్షేమాధికారి ఆర్ఎస్ జాన్, సమగ్ర శిక్ష ఏపీసీ రామారావు, కలెక్టరేట్ ఏవో దేవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

(వార్తలు 7లో)



- జామి మండలం భీమసింగి చక్కెర కర్మాగార కార్మికులను ఆదుకోవాలి. ఇందులో పనిచేసిన కార్మికులకు జీతాలు, పీఎఫ్‌లు చెల్లించాలి. దాదాపు ఆరు నియోజకవర్గాలకు చెందిన చెరకు రైతులకు ఈ కార్మాగారం జీవనాధారం. ఈ విషయంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. భవిష్యత్‌లో ఎంఎస్ఎంఈ పార్కుల ద్వారా అయినా చక్కెర కర్మాగారం పునర్నిర్మాణానికి ప్రయత్నించాలి.

- ఈనెల 6న ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శాసన సభలో ప్రస్తావన

మూసేసిన భీమసింగి చక్కెర కర్మాగారం



తీపికబురు ఎప్పుడో!



- భీమసింగి చక్కెర కర్మాగారం తెరవాలంటున్న రైతులు
- తాజాగా అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే లలితకుమారి
- ఆధునికీకరణ పేరుతో నాలుగేళ్ల కిందట మూసేసిన వైసీపీ
- చెరకు రైతులకు ఇబ్బందులు
- జీతాలు, పీఎఫ్‌లను చెల్లించక కార్మికులదీ ఇదే దుస్థితి

శృంగవరపుకోట, మార్చి 16(ఆంధ్రజ్యోతి):

భీమసింగి చెక్కర కర్మాగారాన్ని 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వం మూసేసింది. ఆధునికీకరించి తిరిగి తెరిస్తామని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు నమ్మబలికారు. చెరకు ను పండించే రైతులు, కర్మాగారంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు, కార్మికులు కూడా నిజమే అనుకున్నారు. ఆ ప్రభుత్వం ఐదేళ్లలో కర్మాగార ఆధునికీకరణకు ఒక్క రూపాయి కేటాయించలేదు. మూసేసిన ఒకట్రెండు సంవత్సరాల తరువాత కార్మికులు, రైతులు కార్మాగారాన్ని తెరిపించేందుకు రూ.5కోట్లు వరకు నిధులను కేటాయించాలని నేతలకు విన్నవించారు. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు ఈ ప్రాంతానికి వచ్చే ప్రతి ప్రముఖునికీ కర్మాగార పరిస్థితిని గుర్తుచేసేవారు. నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎవరూ స్పందించలేదు. నేడు కర్మాగార యంత్రాలు పూర్తిగా పాడయ్యాయి. ఆధునికీకరణ అంచనా వ్యయం పెరిగింది. ఇప్పుడు కనీసం రూ.10 కోట్లకు పైబడి నిధులు అందిస్తే తప్ప పునర్నిర్మించడం కష్టం. కర్మాగారం తెరిచే అవకాశం లేక పది ఎకరాల చెరకు పండించే రైతు ఇప్పుడు మూడెకరాల చెరకునే సాగుచేస్తున్నాడు. అలవాటైన చెరకు సాగును వదల్లేక పండిస్తున్న రైతులకు కష్టాలు వెంటాడుతున్నాయి. 50 నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న సంకిలి చక్కెర కర్మాగారానికి పంటను తరలించాల్సి వస్తోంది. కర్మాగారంలో పనిచేసిన కార్మికులకు జీతాలు, పీఎఫ్‌లు వంటివి ఇవ్వక కుటుంబాలు వీధిన పడ్డాయి. ఎమ్మెల్యే లలిత కుమారి (మిగతా 8వ పేజీలో..)

నీటి సమస్యకు చెక్

● మునపరాయి గిరిజన యువత ఏర్పాట్లు

శృంగవరపుకోట రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గిరిశిఖర పంచాయతీ దారపర్తి పంచాయతీలోని మునపరాయి గిరిజనులకు రెండు దశాబ్దాలుగా నీటి సమస్య వెంటాడుతోంది. పాలకులకు విజ్ఞప్తి చేసినా వారు పట్టించుకోక పోవడంతో గెడ్డ చెలమల వారికి దిక్కైంది. మునపరాయిలో నీటి కష్టాలపై స్థానిక గిరిజన యువత చలించారు. నీటి సమస్యను పరిష్కరించుకునేందుకు నడుం బిగించారు. దాదాపు రూ. 10వేలు పోగు చేశారు. మునపరాయి వాసులకు ఆధారమైన చెలమ దగ్గర నీరు నిల్వకు సిమెంట్‌తో గట్టు కట్టారు. ఆ గట్టు కింది భాగానికి పైప్‌ను అమర్చారు. అక్కడ నుంచి మునపరాయి గ్రామం వరకు పైప్‌లైన్ వేశారు. దాంతో ఆ చెలమ నుంచి నిరంతరం నీరు వస్తుండటంతో స్థానికులు అవసరాలు తీర్చుకుంటున్నారు. నీటి సమస్య తీర్చిన యువతను స్థానికులు అభినందించారు.



చెలమ వద్ద సిమెంట్ గట్టు, గట్టు దిగువన పైప్ అమరిక



నీరు పడుతున్న మహిళ

టీకాలే పిల్లలకు శ్రీరామ రక్ష

కొత్తవలస, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వ్యాధినిరోధక టీకాలే పిల్లలకు శ్రీరామరక్ష అని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సింహాద్రినాయుడు అన్నారు. జాతీయ వ్యాధి నిరోధ టీకా దినోత్సవం సందర్భంగా గ్రామంలోని అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులకు టీకాలపై ఆదివారం అవగాహన కల్పించారు. భారతదేశంలో 995లో పోలియో టీకాను మార్చి 16న వేశారన్నారు. దాని జ్ఞాపకార్థం ఏటా అదేరోజున టీకాల దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వ్యాధి రహిత దేశమే ధ్యేయంగా టీకాలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జగదాంబ, పద్మావతి, రోజా, సత్యారావు, భవాని పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహా ప్రతిష్ఠోత్సవాలు

కొత్తవలస, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలోని కుమ్మరబంజరు ఎన్‌జీజీవోస్ కాలనీ సమీపంలో గరుడాద్రి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఆదివారం గరుత్మంతుడు విగ్రహా ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభమయ్యాయి. గరుత్మంతుడి విగ్రహానికి క్షీరాధివాసం, జలాధివాసం, ధాన్యాధివాసం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బోని వెంకట అప్పారావు ఆధ్వరంలో కార్యక్రమం

గద్దెగుడిలో కోటమ్మకు పూజలు

శృంగవరపుకోట రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కొట్టాం కోటమ్మతల్లి పండుగ ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈనెల 10న దేవర ఉత్సవం ద్వారా వనం గుడిలోని అమ్మవారిని గ్రామంలోని గద్దెగుడిలో కొలువుదీర్చారు. ఆదివారం గద్దెగుడిలో అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. పండగ ఏర్పాట్లు ఇప్పటికే పూర్తిచేశామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

40 మందికి వైద్య పరీక్షలు

దత్తిరాజేరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండ లంలోని పోరలి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటైంది. సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 140 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్, ఎన్ ఆర్ఐ ఆసుపత్రి పీఆర్‌వో సత్యనారాయణ, సభ్యులు ఉదయ్, రమేష్, ఆశిక్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

దత్తిరాజేరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాచవలసలో రామాలయం నిర్మాణానికి ఆదివారం గ్రామస్థులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుమల గోవింద్, సుంకరి సత్యం, సుంకరి ఈశ్వరరావు, దుప్పాడ చిన్నమనాయుడు, గుసిడి సూర్యనారాయణ పాల్గొన్నారు.

సర్వేను పూర్తిచేయండి

రాజాం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలను గుర్తించి సకాలంలో నివేదికలు అందించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం కంచరాంలో చేపడుతున్న పి-4 సర్వేను పరిశీలించారు. త్వరితగతిన సర్వే పూర్తి చేయాలన్నారు.

కలెక్టర్ దృష్టికి సాయన్న చానల్ సమస్యలు

రేగిడి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సాయన్న చానల్, దాని అనుబంధ చానల్స్ పరిధిలో రైతుల ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు సంకిలి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సమస్యను రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావుకు తెలియజేసినట్టు తెలిపారు. ఒకటి రెండురోజుల్లో నేరుగా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరిస్తానన్నారు.

నెల రోజుల్లో రెస్కో పునరుద్ధరణ: కళా



ఎమ్మెల్యే కళాకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో

చీపురుపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలో ఆర్ఈసీఎస్ సంస్థను నెల రోజుల్లో పునరుద్ధరిస్తామని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు వెల్లడించారు. ఈ సంస్థ పునరుద్ధరణకు సంబంధించి ఇప్పటికే ముఖ్యమంత్రి ఆమోదం తెలిపార న్నారు. ఆదివారం సాయంత్రం ఆయన చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సంస్థను తరిగి ప్రారంభించడం వల్ల ఇక్కడి రైతు లకు మేలు జరుగుతుందన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి తోటపల్లి నీటిని ఆయకట్టుకు పూర్తి స్థాయిలో అందించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. పూడికతీత పనులకు సంబంధించి, టెండర్లు ఖరారు కానున్నాయన్నారు. మే రెండో వారం నాటికి పనులు పూర్తి చేసేలా లక్ష్యంగా తీసుకున్నట్టు తెలిపారు. జూన్ మొదటి వారం నాటికి ప్రాజక్టు పరిధిలో ఉన్న నాలుగు వేల చెరువులను నీటితో నింపుతా మన్నారు. పూసపాటిరేగ, రణస్థలం మండలాల్లో కాలువ తవ్వకాలు జరపాల్సి ఉందన్నారు. తోటపల్లి పనుల పురోగతిపై త్వరలోనే మంత్రి నిమ్మల నేతృత్వంలో సమీక్ష జరగనుందని, ఆ సమీక్షకు తాను కూడా హాజరు కానున్నట్టు కళా తెలిపారు. అనంతరం, గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు.

వచ్చే ఏడాది మరింత వైభవంగా జాతర..

చీపురుపల్లిలో కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరను వచ్చే ఏడాది మరింత వైభవంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. ఈ నెల 2 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన అమ్మవా జాతర ఉత్సవాలు విజయవంతమయ్యాయన్నారు. కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో బండ్లమూడి శ్రీనివాస్, కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, అర్చకులు రవి, భవానీ శంకర్ తదితరులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, విసినిగిరి శ్రీనివాసరావు, చిన్నారావు, గడే సన్యాసప్పలనాయుడు తదితరులున్నారు.

అమ్మవారి సేవలో న్యాయాధికారులు

చీపురుపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలోని కనకమహాలక్ష్మి అమ్మవారిని ఆదివారం పలువురు న్యాయాధికారులు దర్శించుకున్నారు. విజయనగరం ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి కె.విజయకల్యాణి, చీపురుపల్లి జూనియర్ సివిల్ న్యాయాధికారి వై.ప్రేమలత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బి.శ్రీనివాస్, కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు.. న్యాయాధికారులకు అమ్మవారి ప్రసాదం, చిత్రపటాలను అందజేశారు.



న్యాయాధికారులకు అమ్మవారి చిత్రపటాలు అందజేస్తున్న ఈవో

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సంతకవిటి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి); మండలంలోని మిర్తివలసలో సంపత్ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు పార్థశారదాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారు, అమ్మవార్ల ధ్రువమూర్తులకు స్నపన తిరుమంజనం సేవ నిర్వహించారు. పంచామృతం, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకం చేశారు.



తిరుమంజన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

ఏపీటీఏఎస్ఏ జిల్లా అధ్యక్షుడిగా ఆదినారాయణ

విజయనగరం కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీటీఏఎస్ఏ) జిల్లా అధ్యక్షుడిగా విజయనగరం ఉప ఖజానా అధికారి ముదిలి ఆదినారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీటీఏఎస్ఏ విజయనగరం యూనిట్ ఎన్నికలు ఆదివారం జిల్లా ఖజానా కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా కార్యదర్శిగా సీఎస్ కిరణ్‌కుమార్, సహాధ్యక్షుడిగా ఎం.నూకరాజు, కోశాధికారిగా పి.వీరన్నదొర, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కృష్ణ శ్రవణ్, ఉపాధ్యక్షులుగా సురేష్‌బాబు, రామకృష్ణ, వరలక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా రమేశ్‌బాబు, దుర్గాప్రసాద్, జయశ్రీ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పీవీ నారాయణ వ్యవహరించారు.

గంజాయిపై కఠిన చర్యలు: ఎస్పీ



ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, మార్చి 16 (ఆంధ్ర జ్యోతి): గంజాయి విక్రయం, రవాణా తీవ్రమైన నేరంగా పరిగణించి చట్టపరిధిలో కఠిన చర్యలు చేపడతామని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా ఒకవైపు కఠిన చర్యలు చేపడుతున్నామన్నారు. మరోవైపు విద్యార్థులు, యువత, ప్రజలకు వాటివల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన యువతలో మార్పు తీసుకుని వచ్చి వారిని సన్మార్గంలో నడిపేందుకు సంకల్పం పేరిట కార్యక్రమాలను నిర్వహిస్తున్నామ న్నారు. 2024లో గంజాయి రవాణాకు పాల్పడిన 62 మందిపై కేసులు నమోదు చేసి 1,656.99 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. 70 గ్రాముల నల్ల మందును స్వాధీనం చేసుకుని 218 మందిని అరెస్టు చేశామన్నారు. 2025లో ఇప్పటి వరకూ 24 కేసులు నమోదు చేసి 265.62 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, 65 మందిని అరెస్టు చేశామన్నారు. గంజాయి వ్యాపారాలతో కూడబెట్టిన ఆస్తులను అటాచ్ చేస్తున్నామన్నారు. గంజాయి రవాణా నియంత్రణకు జిల్లాలో ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం వాహనాలు తనిఖీ చేపడుతున్నట్టు వివరించారు. గంజాయి కేసుల్లో తరచూ నేరాలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్‌లు తెరిచి, వారి కదలికలపై నిఘా పెంచామని ఎస్పీ పేర్కొన్నారు.

గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన

నెల్లిమర్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని జరజాపుపేట గ్రంథాలయ నూతన భవనానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. నవోదయ గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు బోలే రామారావు రూ.2 వేల విలువైన పుస్తకాలు గ్రంథాలయానికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్ఎస్ఎన్ఎస్ రాజు, వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, అధ్యక్షుడు కొత్తలి ఎర్రినాయుడు, కె.దయానంద్, నవోదయ గ్రంథాలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కడలి ప్రకాశరావు, అధ్యక్షుడు సుంకరి వాసుదేవరావు, పోలు బోతు రామారావు, మూత రామకృష్ణ, మద్దిల సత్యనారాయణ తదితరులున్నారు.



శంకుస్థాపన నవోదయ గ్రంథాలయ కమిటీ

అప్‌గ్రేడ్ సబ్ పోస్టాఫీస్ ప్రారంభోత్సవం

నెల్లిమర్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని సబ్ పోస్టాఫీస్.. అప్‌గ్రేడ్ సబ్ పోస్టాఫీస్‌గా ఎంపికైంది. ఆదివారం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి విజయనగరం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీస్‌ల ద్వారా అందుతున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ జి.ఎర్రయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టాఫీస్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు

రేగిడి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో లక్ష్మీపురంలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం మహిళల భక్తిశ్రద్ధలతో వ్రతాలు నిర్వహించారు. ఖండ్యాంకు చెందిన వేద గురువు అంపోలు రుద్రకోటేశ్వరశర్మ, శిష్యబృందం ఆధ్వర్యంలో హోమాలు జరిగాయి. సర్పంచ్ కెంబూరు తేజోవెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

అప్పయ్యపేటలో నవోదయం

నెల్లిమర్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పయ్యపేటలో ఆదివారం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరావు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సారా తయారు చేయడం చట్ట వ్యతిరేకమన్నారు. ఎవరైనాసారా తయారుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంట్యాడలో నాలుగు టెన్త్ పరీక్ష కేంద్రాలు

గంట్యాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు కేంద్రాల్లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 151 మంది, బుడతానాపల్లి జడ్పీ పాఠశాలలో 122 ప్లస్ 10, ఏపీ మోడల్ స్కూల్‌లో 196 మంది, గంట్యాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో 250 మంది.. మొత్తం 719 మంది పరీక్షలకు హాజరుకానున్నారని ఎంఈవో విజయకుమారి తెలిపారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

మెంటాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెల్లిగూడెంలో వృద్ధురాలు రాళ్లపూడి అంకమ్మ (75) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. శనివారం రాత్రి నిద్రించిన అంకమ్మ ఆదివారం ఉదయం మంచంపై మృతి చెం దినట్టు గుర్తించిన అదే గ్రామానికి చెందిన బంగారి గౌరిబాబు.. విశాఖలో ఉంటున్న మనవరాలు పైల దుర్గకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి మృతి చెందిన అమ్మమ్మ ముక్కు దగ్గర ఎండిన రక్తపు మరకలు ఉన్నట్టు గమ నించి దుర్గ ఆంధ్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఎస్ఐ సీతారాం అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

మద్యానికి బానిసై వ్యక్తి..

సంతకవిటి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి); మండలంలోని శేషాద్రిపురం గ్రామానికి చెందిన కొమనాపల్లి కళవయ్య (58) అధికంగా మద్యం తాగడం వల్ల మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ ఎస్.దుర్గాప్రసాద్ తెలిపారు. మద్యం అధికంగా తాగి ఈనెల 10న ఇంట్లో పడిపోవడంతో కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రి చేర్పించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడని తెలిపారు. మృతుడి భార్య సన్యాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు.

జామిలో పూరిళ్లు దగ్ధం

జామి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రంభవీధిలో ఆదివారం మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. పెళ్లి సందర్భంగా వెలిగించిన తారాజువ్వ పడటమే ఇందుకు కారణం. ఈ ఘటనలో కోరాడ దేముడు, వియ్యపు రాము, పైడమ్మ ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. బాధిత కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలారు. రూ.6 లక్షల వరకూ ఆస్తినష్టం జరిగి ఉంటుందని బాధితులు చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



పూరిళ్లు దగ్ధమవుతున్న దృశ్యం

రామస్వామిపేటలో గడ్డివాములు, నీలగిరితోట..

వేపాడ మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామస్వామిపేటలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో చెందిన ఐదు గడ్డి వాములు నీలగిరి తోట దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగాఅగ్ని ప్రమాదం జరిగి నట్టు స్థానికులు భావిస్తున్నారు. ఈ ఘటనలో గ్రామానికి చెందిన అవగడ్డ పాత్రునాయుడు, అవగడ్డ విజయలక్ష్మి, తేనంగి నాగేశ్ గుదే తాతలకు చెందిన గడ్డి వాములు.. గొలగాని కృష్ణమూర్తికి చెందిన నీలగిరి తోట దగ్ధమ య్యాయి. ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.



కాలిపోయిన నీలగిరి చెట్లు

పేకాట శిబిరంపై దాడి: ఏడుగురి అరెస్టు

మెరకముడిదాం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫిరియాపేటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం బుధరాయవలస ఎస్ఐ లోకేశ్ కుమార్ దాడి చేశారు. ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.9600 నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పొట్టేళ్ల పందేలపై..

లక్కవరపుకోట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్జాం గ్రామ శివారులో ఆదివారం పొట్టేళ్ల పందేల శిబిరంపై ఎస్ఐ నవీన్‌పడాల్ దాడి చేశారు. 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి రెండు పొట్టేళ్లు, రెండు బైక్‌లు, 8 సెల్ ఫోన్లు, రూ.4430 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

మహిళల భద్రతకు శక్తి యాప్

విజయనగరం క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి యాప్‌ను నగరంలో పోలీసులు యువతకు మొబైల్ ఫోన్‌ల్లో డౌన్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ప్రధానంగా మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయాల్లో శక్తి యాప్ రక్షణగా నిలుస్తుందని అవగాహన కల్పిస్తున్నారు. ఆపద సమయాల్లో సదరు మహిళలు పోలీసులకు సమాచారం అందించలేని పరిస్థితుల్లో ఈ యాప్ పనిచేస్తుందని తెలుపుతున్నారు. మొబైల్ ఫోన్‌ను గాల్లో షేక్ చేసినా, వారి లోకేషన్ ఆడియో, వీడియో వివరాలను దగ్గరలోని పోలీసుస్టేషన్‌కు చేరుతాయని అవగాహన కల్పిస్తున్నారు. ఆదివారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో కానిస్టేబుల్స్ లక్ష్మంనాయుడు, పాపినాయుడు పాల్గొన్నారు.



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తాటిపూడిలో ఎస్ఐ పల్లెనిద్ర

గంట్యాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి శనివారం రాత్రి గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ శనివారం రాత్రి పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. చట్టాలు, సైబర్ క్రైం, రహదారి భద్రత, శక్తి యాప్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా అందరూ సహకరించాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో పల్లె నిద్ర చేశారు. ఆయనతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పల్లె నిద్ర చేస్తున్న ఎస్ఐ సాయికృష్ణ

సత్తాచాటిన కె.కొత్తవలస విద్యార్థులు

దత్తిరాజేరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన యురేకా సైన్స్ ఎక్స్‌పో-2025 షార్ట్ ఫిల్మ్ ఆన్‌లైన్ పోటీల్లో మండలంలోని కె.కొత్తవలస ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మూఢనమ్మకాలు విడనాడుదాం- శాస్త్రీయ దృక్పథం విభాగంలో ఇక్కడి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతి పొందారు. అలాగే జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. ఈ పోటీల్లో 8వ తరగతి విద్యార్థులు కె.ఏకాంతీశ్వర్, బి.దుర్గాప్రసాద్, యు.హరికృష్ణ పాల్గొన్నారు. విద్యార్థులకు గైడ్‌గా భౌతిక శాస్త్రం టీచర్ ఎస్.రవీంద్ర వ్యవహరించారు. విద్యార్థులను హెచ్‌ఎం రాజు, ఎంఎస్ఎస్ చైర్మన్ నూకరాజు, గ్రామ పెద్దలు అభినందించారు.



బహుమతులు సాధించిన విద్యార్థులు

అమరజీవికి నివాళి

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించారు. భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటుకు ఆయన చేసిన ప్రాణత్యాగాన్ని కీర్తించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. (ఆంధ్రజ్యోతి బృందం)



బాడంగి: శాఖా గ్రంథాలయంలో..



బొబ్బిలి: బాలికల హాస్టల్‌లో...



ఎస్.కోట: గాంధీ పార్క్ వద్ద..



గరివిడి: వాసవీ ఆలయం వద్ద..



రాజాంలో పూలమాల వేస్తున్న దృశ్యం



కొత్తవలసలో..



సంతకవిటిలో..



చీపురుపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఖాళీగా ఉన్న మండల ఇంజనీరింగ్ అధికారి చాంబర్

అధికారులు లేక.. పాలన సాగక

● ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్న వైనం ● సేవలందక ప్రజలకు తప్పని అవస్థలు

● ఇదీ రామభద్రపురం మండలంలో పరిస్థితి

రామభద్రపురం, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు శాఖలకు పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో పాలన సజావుగా సాగడం లేదు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు.దీంతో సేవలు అందకపోవడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇప్పటికైనా జిల్లాఅధికారులు స్పందించి ఖాళీగా ఉన్న కీలకమైన పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు

● వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి కీలకమైన మండల ఇంజనీరింగ్ అధికారి పోస్టు కొద్దినెలలుగా ఖాళీగా ఉంది. పల్లెపండగకు సంబంధించి పలు పనులు జరుగుతున్న విషయం విదితమే. ఈ పరిస్థితిలో మండల ఇంజనీరింగ్ అధికారి లేకపోవడంపై ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

● మండల హౌసింగ్ అధికారి పోస్టు కూడా గత కొద్దినెలలుగా ఖాళీగా ఉంది. దీంతో హౌసింగ్ కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారులు కూడా ఇబ్బందులుపడుతున్నారు. ఇటీవల ప్రభుత్వం పక్కా ఇళ్ల మంజూరుకు ఆదేశాలుజారీ చేయడంతో హౌసింగ్ కార్యాలయానికి పెద్దసంఖ్యలో లబ్ధిదారులు వస్తున్నారు.● మండలంలోని కొండకెంగువ, కొట్టక్కి, రొంపల్లి గ్రామాలకు గ్రామ పరిపాలనాధికారులు లేరు. దీంతో ఇన్‌చార్జి అధికారులతో పరిపాలన నెట్టుకొని రావాల్సి వస్తోంది. ● బూసాయవలస గ్రామకార్యదర్శి పోస్టు కూడా ఖాళీగా ఉంది.

గదులు చాలక.. వరండాలో బోధన

● ఎండ తీవ్రతకు విద్యార్థుల అవస్థలు ● ఇదీ ఎరకందొరవలస పాఠశాలలో పరిస్థితి

బొబ్బిలి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశిందొరవలస పంచాయతీలోని ఎరకందొరవలస పాఠశాలలో కనీస వసతులు కొరవడ్డాయి. ఇక్కడ ఒకటి నుంచి ఐదోతరగతి వరకు 41మంది విద్యనభ్యసిస్తున్నారు. ప్రధానంగా గదులు చాలకపోవడంతో వరండాల్లో బోధించాల్సివస్తోంది. వైసీపీ ప్రభుత్వం హయాంలో నాడు- నేడు పథకం కింద పక్కా భవనాన్ని నిర్మించి అప్పగించింది. బాత్ రూములు, ప్రహరీ, బల్లలు వంటి మౌలికవసతులను ఏర్పాటు చేసింది. కాగా ఈ పాఠశాలలో పక్కనే ఉన్న చిలకమ్మవలస, కొత్తూరు తదితర గిరిజన గ్రామాల చిన్నారులు ఇక్కడే విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం మౌలిక సదుపాయాల కల్పనతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇక్కడి పాఠశాలకు పంపుతున్నారు.అయితే ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య పెరగడంతో ఉన్న ఒక్క పాఠశాల గది చాలక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 41 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఇరుగ్గా ఉండే గదికావడంతో వరండా, పాఠశాల ఆవరణలో ఓ రేకులషెడ్డులో విద్యార్థులు అభ్యసిస్తున్నారు. వేసవి కావడంతో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు అవస్థలకు గురవుతున్నారు. అదనపు గది నిర్మించాలని ఉన్నతాధికారులకు విన్నవించామని, ఇంతవరకు మంజూరు కాలేదని, ఇప్పటికైనా అదనపు తరగతి గది నిర్మాణానికి ప్రభుత్వం, అధికారులు చొరవ చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



రేకుల షెడ్డు కింద అభ్యసిస్తున్న విద్యార్థులు



చెరువులో మట్టివేసి కప్పేస్తున్న దృశ్యం

చెరువు కప్పేశారు.. శ్మశానం ఆక్రమించేశారు

● చోద్యం చూస్తున్న అధికారులు ● ఇదీ పాతబొబ్బిలి రోడ్డులో పరిస్థితి

బొబ్బిలి,మార్చి 16(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణం పరిధిలోని మూడో వార్డులో గల పాతబొబ్బిలి రోడ్డులో కొందరు వ్యక్తులు చెరువును కప్పేశారు. అక్కడ గల శ్మశాన వాటికను సైతం ఆక్రమించేశారు. కొద్దిరోజులుగా కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు చీకటి పడిన తర్వాత యంత్రాలతో చెరువులో మట్టివేసి కప్పుతున్నారు. యథేచ్ఛగా ఆక్రమిస్తున్నా రెవెన్యూ అధికారులు చోద్యంచూస్తుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వార్డులో సుమారు నాలుగు వేల మంది వరకూ నివసిస్తున్నారు. గతంలో తాగునీటి అవసరాన్ని కొంతమేర ఇక్కడి చెరువులు తీర్చేవి. దీనికి ఆనుకుని ఉన్న చెరువుతో కలిపి రెండు వేల ఎకరాల వరకూ ఆయకట్టుకు నీరందేది. అయితే ప్రస్తుతం పాతబొబ్బిలిలోని సుమారు మూడెకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువు ద్వారా సుమారు 70 ఎకరాలకు సాగునీరందేది. జనావాసాలు పెరగడం, పట్టణం విస్తరిస్తుండడంతో కొందరు కళ్లు చెరువుతోపాటు ఆనుకుని ఉన్న శ్మశానంపై పడ్డాయి. దీంతో రోడ్డును ఆనుకుని నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలోగల ఈ చెరువును బాహాటంగా కొందరు ఆక్రమిస్తున్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి చెరువులో ఆక్రమణలు తొలగించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. కాగా పాతబొబ్బిలి రోడ్డులో భైరిసాగరం చెరువు ప్రాంతంలో కబ్జా జరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై రెవెన్యూ సిబ్బందితో కలిసి విచారించామని మునిసిపల్ సర్వేయర్ నాగేశ్వరరావు తెలిపారు. చెరువు చుట్టూ సరిహద్దులకు సంబంధించి ఇటీవల ట్రెంచ్ కటింగ్ చేసినట్లు చెప్పారు. జిరాయితీలో కొంతమంది భవనాల శిథిలాలు, మట్టిని వేసి ఎత్తును పెంచుకుంటున్నారని తెలిపారు. చెరువు ప్రాంతంలో ఎటువంటి ఆక్రమణలు జరగలేదని చెప్పారు. అది జిరాయితీ భూమి అని మునిసిపల్ కమిషనరుకు తాము నివేదిక ఇచ్చామని తెలిపారు.

నిధులు లేక.. నిర్మాణం జరగక

● ఇదీ మోసూరువలసలో అంగన్‌వాడీ కేంద్రం భవనం పరిస్థితి



శ్లాబు స్థాయిలో నిలిచిన అంగన్‌వాడీ భవనం పనులు

బొబ్బిలి రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోసూరు వలసలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మాణానికి నిధులు లేక ముందుకు సాగలేదు. పనులు శ్లాబ్ స్థాయిలో నిలిచిపోయాయి. ఈ భవనం నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ.7.5 లక్షలు మంజూరయ్యాయి.ఈ పనులు సుమారు ఏడాది కిందట ప్రారంభంకాగా ఇంతలో ప్రభుత్వం మారడం, నిధుల కొరతతో పనులు నిలిచిపోయాయి. కాగాఈ భవన నిర్మాణానికి ఇంతవరకు 50 శాతం నిధులు విడుదలయ్యాయని, మిగిలిన నిధులు మంజూరుకాగానే పని ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు తెలిపారు. అలాగే నిధులు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయని ఐసీడీఎస్ పీవో జె. విజయలక్ష్మి చెప్పారు.

పీఆర్సీని నియమించాలి

● రిటైర్డ్ ప్రభుత్వోద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మూర్తి



మాట్లాడుతున్న ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

బొబ్బిలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీని తక్షణమే నియమించాలని రిటైర్డ్ ప్రభుత్వోద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రౌతు రామ్మూర్తి కోరారు. ఆదివారం స్థానిక పెన్షనర్లసంఘం కార్యాలయంలో సంఘంప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై సోమవారం తహసీల్దారు కార్యాలయాలఎదుట ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. బొబ్బిలిలో రాష్ట్రనేతల సారథ్యంలో ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. తమ సంక్షేమం, హక్కుల పట్ల గతప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వంలో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించామన్నారు. ఐఆర్, డీఆర్ ప్రకటించాలని, బకాయిలు క్లియర్ చేయాలని, హెల్త్ కార్డులపై వైద్యసేవలను అందించాలని కోరారు. బొబ్బిలిలో సోమవారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు లచ్చుపతుల జగన్నాథం, పోల సత్యంనాయుడు, బొత్స సత్యనారాయణ, చుక్క శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు బొబ్బిలి యువకుడు



భానుప్రసాద్‌కు చెక్కు అందజేస్తున్న బేబీనాయన

బొబ్బిలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి గొల్లవీధికి చెందిన యువకుడు దీసరి భానుప్రసాద్ అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. విశాఖలో ఇటీవల జరిగిన పోటీల్లో 200 కిలోల విభాగంలో భానుప్రసాద్ ప్రథమ స్థానంలో నిలిచి ఏప్రిల్‌లో నేపాల్‌లో జరగనున్న ఇంటర్నేషనల్స్‌కు అర్హత సాధించాడు.ఈ మేరకు బొబ్బిలి కోటలో భాను ప్రసాద్‌తోపాటుకోచ్‌లు కేతిరెడ్డి సాయివరుణ్, శంబంగి పురుషోత్తంను ఎమ్మెల్యే బేబీనాయన అభినందించయారు. ఈ సందర్భంగా భానుప్రసాద్‌కు రూ.20 వేలు అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రామభద్రపురం, మార్చి 16: కొండకెంగువ గ్రామ సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టుచేసి, వారి వద్ద నుంచి రూ. 3350 స్వాధీనం చేసుకున్నట్లు బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు తెలిపారు. అలాగే ఆరు ద్విచక్రవాహనాలు కూడా సీజ్ చేశామని చెప్పారు. బాడంగి ఎస్‌ఐ తారకేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కిట్ల పంపిణీ

రామభద్రపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో కష్టపడి చదవడం అలవాటు చేసుకోవాలని కారుణ్య ఫౌండేషన్ ఛైర్మన్ జేసీ రాజు సూచించారు. ఆదివారంమండలంలోని బూసాయవలస కస్తూరిబా పాఠశాలలో పరీక్షలకు హాజరయ్యే 40 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శేఖర్, సీఆర్‌టీ దమయంతి, బండారు తిరుమలరావు పాల్గొన్నారు.

కాలువపై ఆక్రమణలు తొలగించండి

● సీపీఎం జిల్లా కార్యదర్శి శంకరరావు

తెర్లాం, మార్చి16 (ఆంధ్రజ్యోతి):తోటపల్లి కుడికాలువ నుంచి లింగయ్య చెరువుకు సుమారు 300 మీటర్ల పొడవు గల పిల్ల కాలువ పరిధిలో ఆక్రమణలు తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శంకరరావు కోరారు. కాలువ గట్టుపై నాటు బండి వెళ్లేంతమార్గం ఉండేదని, దీనిని నెమాలాం గ్రామానికి చెందిన ఓ రైతు ఆక్రమిం చారని తెలిపారు. 19ఏళ్లుగా పలు ప్రభుత్వాలకు విన్నవించినా ఫలితం లేకపోయిం దని వాపోయారు. ఈ కాలువ ద్వారా సతివాడ, విజయరాంపురం, ఎస్.బూర్జివలస, అప్పలంపేట, నెమాలాం గ్రామాల్లోని చెరువులు, పీడర్ చానల్ ద్వారా నిండి 1500 ఎకరాలకు నీరందాల్సిఉందని తెలిపారు. ప్రస్తుతం ఆక్రమణల వల్ల నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఆక్ర మణదారులపై చర్యలు తీసుకోకపోతే ఈనెల20న తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎంనాయకులు రామారావు, ధనుంజేయరావు, గోపాలం పాల్గొన్నారు.



ఆక్రమణకు గురైన తోటపల్లి పిల్లకాలువను పరిశీలిస్తున్న నాయకులు

నిర్వహణ లేక..శిథిలావస్థకు చేరి



ఎం.పణుకువలసలో నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనం

● నిరుపయోగంగా మారిన భవనం

● ఇదీ ఎం.పణుకువలసలో పాఠశాల దుస్థితి

బొబ్బిలి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.పణుకువలస ప్రాథమిక పాఠశాల భవనం నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరింది. ఇక్కడ 16 మంది విద్యార్థులు చదువుతుండగా, ఇద్దరు ఉపాధ్యాయినులు బోధిస్తున్నారు. పాఠశాలకు రెండు భవనాలు ఉండగా ఒకటి శిథిలావస్థకు చేరుకుంది. దీనికితోడు ఆ భవనం వెనుక భాగంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడం వల్ల ప్రమాదకరంగా ఉంది.దీంతో ఆ భవనంలో తరగతులు నిర్వహించడానికి భయాందోళనతో దాన్ని ఖాళీ చేశారు.దీంతో ప్రస్తుతం ఒకభవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. భవనం శిథిలావస్థకుచేరడంతో వినియోగంలో లేకుండా పోయింది.ఏ క్షణంలోనైనా కూలిపోయేలా ఉండడంతో భవనాన్ని కూల్చి వేయాలని, లేకుండా మరమ్మతులు చేపించాలని విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. భవనాన్ని కూల్చివేసి కొత్తగా నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా భవనం దుస్థితిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని ఎంఈవో లక్ష్మణరావు తెలిపారు.

19న సీజ్‌చేసిన వాహనాల వేలం

విజయనగరం క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని టూ టౌన్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు కోర్టు ఆదేశాల మేరకు ఈనెల 19న వేలం పాట నిర్వహించనున్నట్లు టూ టౌన్ సీఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి గలవారు పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

సారూ.. సిఫారసు చేయరూ..

(5వ పేజీ తరువాయి)

చేసుకున్నారు.నేతల అండ చూసుకొని కొందరు ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కాగా అప్పట్లో అధికారులు కూడా వైసీపీ నేతల సిఫారసులనే ప్రామాణికంగా తీసుకొని విధివిధానాలకు నిలుపు పాతరేసి స్వామిభక్తిని చాటుకున్నారు. బదిలీల సమయంలో రాజకీయ ఉద్యోగులను కస్టర్ పరిధిని దాటించకుండా అప్పటి నేతల కళ్లల్లో ఆనందం కోసం అక్కడికక్కడే బదిలీ చేస్తూ మమ అనిపించేశారు.

అక్కడికక్కడే బదిలీలు

లక్కవరపుకోట మండలంలో 2006 జాయినైన ఓ అధికారి రెండేళ్లకే 2010 నుంచి కొత్తవలస, 2014లో ఎస్.కోట తరువాత మళ్లీ కొత్తవలస, 2017లో వేపాడ, 2018 నుంచి మళ్లీ కొత్తవలసకు వచ్చి ప్రస్తుతం కొనసాగుతున్నారు. ఇక 2006లో ఎల్.కోటలో జాయినైన మరో అధికారి పరిస్థితి కూడా అంతే. వేపాడ, కొత్తవలస, ఎస్‌కోటకు వెళ్లారు. ఓ మహిళా ఉద్యోగి 2006 నుంచి 2020 వరకు ఎస్.కోట, ఎల్.కోట, వేపాడ, కొత్తవలస ఇలా అక్కడికక్కడే బదిలీలు జరిగేలా చూసుకున్నారు. 2006లో జామిలో జాయినైన మరో మహిళా ఉద్యోగి ఎల్.కోటకు వెళ్లి మళ్లీ జామికి చేరారు. 20 ఏళ్లుగా 20 మంది వరకు ఉద్యోగులు క్లస్టర్ల పరిధిలోనే తిరుగుతున్నారు

మీ మనుషులుగా ఉంటాం

అప్పట్లో వైసీపీ నేతల వద్ద స్వామి భక్తిని ప్రదర్శించిన ఉద్యోగులు ఏ ఎండకు ఆ గొడుగు సూత్రాన్ని ఫాలో అవుతున్నారు. ఇప్పుడు టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకోవడానికి తంటాలు పడుతున్నారు. ఇకపై మీ మనుషులుగా ఉంటామని, ఫలానా లాభసాటి మండలానికి బదిలీ అయ్యేలా చూడాలని మండల నేతలతో మంత్రాంగం నడుపుతున్నారు. అయితే వీరి ఊసరవెల్లి వేషాలను గమనిస్తూ ఆ నేతలు నిర్మొహమాటంగా వెనక్కి పెడుతూ తమకు కావాల్సిన వారికే ప్రాధాన్యమిస్తున్నారు. వారికి ఎమ్మెల్యేలు కూడా ఇదే సమాధానం చెబుతున్నారు.

'తీపి'కబురు ఎప్పుడో!

(5వ పేజీ తరువాయి)

భీమసింగి చక్కెర కర్మాగార పరిస్థితిని ఇటీవల శాసన సభలో ప్రస్తావించడంతో చెరకు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం నారాచంద్రబాబు నాయుడు, యువ నేత, మంత్రి నారా లోకేశ్‌లు అధికారంలోకి రాగానే భీమసింగి చెక్కర కర్మాగార సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నడుస్తుండడంతో రైతులూ ఆశ పడుతున్నారు.

● 1973లో విజయరామగజపతి చక్కెర కర్మాగారం పేరుతో ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. గజపతినగరం, శృంగవరపుకోట విజయనగరం, నెల్లిమర్ల, చీపురపల్లి, విశాఖ జిల్లా భీమిలి నియోజకర్గాల పరిధిలోని 19 మండలాల రైతులు చెరకును ఇక్కడకు తీసుకొచ్చేవారు.చెరకు తరలించే ప్రతి రైతుకు షేర్లు ఉన్నాయి. పాలక మండలి ఛైర్మన్,డైరెక్టర్ల ఎన్నికలు జరిగేవి. రాజకీయ నాయకులు ఈ పదవుల కోసం పోటీపడి, ఘర్షణలుపడిన సంఘటనలు ఉన్నాయి. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు రైతులకు ఆసరాగా నిలిచిన ఈ కర్మాగారంపై గత పాలకుల నిర్లక్ష్యపు నీడపడింది. మద్దతు ధర లేక రైతుకు గిట్టుబాటు లేకుండ పోయింది. దీంతో రైతులు కొంతచెరకును కర్మాగారానికి,మరికొంత చెరకును బెల్లంక్రషర్‌లకు సరఫరా చేయడానికి అలవాటు పడ్డారు. ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన గత ప్రజా ప్రతినిధులు కర్మాగారాన్ని నిర్వీర్యం చేశారు. అటు తర్వాత పూర్తిగా మూతపడింది.

● కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ(చిన్న, మధ్య, సూక్ష్మ పరిశ్రమల)ల స్థాపనకు ఆసక్తి చూపుతోంది. భీమసింగి చక్కెర కర్మాగారాన్ని కూడా ఎంఎస్‌ఎంఈ జాబితాల్లో చేర్చడం ద్వారా కర్మాగార పునర్నిర్మాణానికి పూనుకోవాలని చెరకు రైతులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధి లేదు

● ఏపీటీఎఫ్ ఉమ్మడి జిల్లాల గౌరవాధ్యక్షుడు జోగినాయుడు



మాట్లాడుతున్న జోగినాయుడు

రామభద్రపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలతో పాటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి కనబరచడం లేదని ఏపీటీఎఫ్ ఉమ్మడి జిల్లాల గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు ఆరోపించారు.ఆదివారం మిర్తివలసలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఉపాధ్యాయుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. పాత బకాయిలు చెల్లించడం లేదని, డీఏలు ఇవ్వలేదని, పీఆర్‌సీ ఏర్పాటుచేయలేదన్నారు.ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని ప్రకటనలు ఇస్తోందే తప్ప,ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. విద్యాప్రమాణాల పెంపుదల ముసుగులో విద్యను ప్రైవే టీకరణ చేయడమే ప్రభుత్వ ఉద్దేశంలా కనబడుతోందని ఆరోపించారు. మన్యం జిల్లా కార్యదర్శి మీసాల వెంకట గౌరీశంకర్ మాట్లాడుతూ పాఠశాలల్లో రెండు మీడియాలను కొనసాగించాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.జగదీశ్వరరావు మాట్లాడుతూ 117 జీవోరద్దుచేయాలని డిమాండ్‌చేశారు.

పారదర్శకంగా పదో తరగతి పరీక్షలు



రామభద్రపురంలో పరీక్ష కేంద్రం పరిశీలిస్తున్న మోహనరావు

రామభద్రపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని బొబ్బిలి డిప్యూటీ డీఈవో కె.మోహనరావు తెలిపారు.ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఈ పరీక్షలకు నియోజకవర్గంలో 22 సెంటర్లు ఏర్పాటు చేశామని, వీటిలో 4,812 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. రామభద్రపురం మండలంలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామని, రామభద్రపురం హైస్కూల్‌లో 270 మంది, గ్లోబల్ స్కూల్‌లో 240 మంది పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని, ప్రతి కేంద్రానికి చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించామని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించామని తెలిపారు.

22 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

బొబ్బిలి, మార్చి 16(ఆంధ్రజ్యోతి):బొబ్బిలి విద్యాశాఖ డివిజన్ పరిధిలో పదో తరగతి పరీక్షలకు 22 కేంద్రాలను ఏర్పాటుచేశారు. సోమవారం నుంచి జరగనున్న పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. బొబ్బిలి పట్టణంలో ఎనిమిది కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించారు. డివిజన్ పరిధిలో బాడంగిలో 528 మంది, బొబ్బిలిలో 1825 మంది, గజపతినగరంలో 690, మెంటాడలో 429 , రామభద్రపురంలో 519, దత్తిరాజేరులో 457, తెర్లాంలో 545 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లి పొట్టిశ్రీరాములు మునిసిపల్ హైస్కూలులో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.